

## మధుమేహ నిర్ధారణ శిబిరం

**జిల్లాలో నేడు**

కందుకూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 26న మండల కేంద్రంలో మధుమేహ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కందుకూరు ఆ క్లబ్ అధ్యక్షుడు సురసాని విఠల్‌రెడ్డి తెలిపారు. ఈ క్యాంపులో ఉచితంగా డయాబెటిస్ పరీక్షలతో పాటు వైద్య సలహాలు, బీపీ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. కందుకూరు గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ నిర్ధారణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆ క్లబ్ కార్యదర్శి తీగల జగదీశ్వర్‌రెడ్డి, కోశాధికారి కుంచకూరి వెంకటేశ్వర్లుగుప్త తదితరులు పాల్గొన్నారు.

## మినీస్టేడియం లేక ఇక్కట్లు

- పదేళ్లుగా నేతల హామీలకే పరిమితం
- సర్కారు స్థలాలున్నా నిర్మాణం కాలే..
- ఇబ్బందుల్లో క్రీడాకారులు
- వెంచర్లు, సాగు భూముల్లో సాధన



8

## డెయిరీ దుకాణాల కేటాయింపు

- 70మంది టెండర్లు దాఖలు
- అదనపు కలెక్టర్ సమక్షంలో ఓపెన్
- కడ్తాల పాల శీతలీకరణ కేంద్రానికి
- భారీగా ఆదాయం



8

## పెంచిన పెన్షన్ వెంటనే ఇవ్వాలి

- దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక
- రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు వెంకట్
- కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల ధర్నా
- రూ. ఆరు వేలు ఇవ్వాలని డిమాండ్



7

## ప్రజావాణికి గైర్హాజరైతే
# చర్యలు తప్పవు

### అధికారులందరూ హాజరు కావాలి

- డాటా ఎంట్రీలో తప్పులుండొద్దు
- ఫుడ్‌సేఫ్టీ కమిటీని నియమించాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి



ప్రజావాణిలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్

రంగారెడ్డి అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణికి జిల్లాస్థాయి అధికారులందరూ హాజరుకావాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 52 దరఖాస్తులు రాగా, అందులో 42 దరఖాస్తులు రెవెన్యూశాఖకు సంబంధించినవి ఉన్నాయి. ప్రజావాణికి గైర్హాజరైన అధికారులపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. కింది స్థాయి అధికారులు రావడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సీఎం ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వారంలోగా పరిష్కరించేలా చూడాలని, డిసెంబర్ 9న దీనిపై సమీక్ష ఉంటుందని ఆయన చెప్పారు.

### గ్రామీణ ప్రాంతాల డాటా ఎంట్రీ 30వరకు పూర్తి చేయాలి

సమగ్ర కుటుంబ సర్వే వివరాలు డాటా ఎంట్రీ చేసే సమయంలో తప్పులు దొర్లకుండా చూడాలని తెలిపారు. సర్వే చేసిన ఎన్యుమరేటర్లు దగ్గర ఉండి సరైన సమాచారాన్ని ఆన్‌లైన్ చేయించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో చేసిన సర్వే డాటా ఎంట్రీని ఈనెల 30 వరకు పూర్తి చేయాలని తెలిపారు. డాటా ఎంట్రీని ఎక్స్‌పర్ట్ టీమ్ చెక్ చేసిన తర్వాతే ఆన్‌లైన్ చేయాలన్నారు.

### హాస్టళ్లను సందర్శించాలి

వసతి గృహాల్లో విద్యార్థులకు అందిస్తున్న ఫలహారం, భోజనం ఇతర సౌకర్యాలను అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. పర్యవేక్షణకు హాస్టల్ పాఠశాలలో జిల్లా స్థాయి, మండల స్థాయిలో ఫుడ్ సేఫ్టీ కమిటీని నియమించాలన్నారు. జిల్లా స్థాయి కమిటీలో డీఈవో, జిల్లా పౌరసరఫరాల అధికారి, డీఎం సీఎస్ కమిటీలో ఉంటారని, అలాగే మండల స్థాయిలో ఎంపీడీవో చైర్మన్లుగా ఇద్దరు సభ్యులుగా ఉంటారని తెలిపారు. మున్సిపల్ స్థాయిలో కూడా ఫుడ్ సేఫ్టీ కమిటీలు ఉంటాయని అన్నారు. వసతి గృహాలు, పాఠశాలలో అందించే భోజనం నాణ్యత లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటీవల తాము తనిఖీ చేసిన వసతిగృహాల్లో వంటసామగ్రి భద్రత లేకుండా ఉంచారని, ప్లాస్టిక్ డబ్బాలు, టేబుల్స్‌పై ఉంచేవిధంగా కొత్త సామగ్రిని అందజేయడం జరుగుతుందని, వీటి కొనుగోలుకు దాతల ద్వారా విరాళాలు సేకరించాలని అధికారులకు సూచించారు. హాస్టల్స్ కస్తూర్బా వసతి గృహాలు, పాఠశాలలో మార్పు తీసుకురావాలని, దీనికి అధికారులు తోడ్పాటునందించాలన్నారు. వారంలోగా ఆయా కమిటీలు వారంలో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అధ్వాన భోజనం!

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉంటుంది. విద్యార్థులకు ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల చారునే వడ్డిస్తున్నారు. బడులకు సరఫరా అవుతున్న పురుగులు పట్టిన బియ్యాన్నే విద్యార్థులకు వండిపెడుతున్నారు. నాసిరక భోజనం తినలేక పిల్లలు అర్ధాకలితో అలమటిస్తున్నారు. కిచెన్ షెడ్లు లేక ఆరుబయటే దుమ్మూధూళి మధ్య నిర్వాహకులు వంటావార్పు చేస్తున్నారు. సమయానికి బిల్లులు రాక ఏజెన్సీలు పాడైన కూరగాయలను తెచ్చి కూరలు వండుతున్నారు. డైనింగ్ హాల్స్ లేకపోవడంతో విద్యార్థులు తరగతి గదుల్లో, వరండాలు, చెట్ల కింద మట్టిలో కూర్చుని భోజనం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సోమవారం మధ్యాహ్న భోజన తీరుపై పలు పాఠశాలలను 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేయగా విద్యార్థుల అవస్థలు వెలుగులోకి వచ్చాయి.



ఆంధ్రజ్యోతి విజిట్

కేశంపేట : పురుగు పట్టిన బియ్యాన్ని శుభ్రం చేస్తున్న ఆయా

**రంగారెడ్డి జిల్లా**

| | |
|---|---|
| మండలాలు | 27 |
| ప్రాథమిక పాఠశాలలు | 882 |
| ప్రాథమికోన్నత పాఠశాలలు | 179 |
| ఉన్నత పాఠశాలలు | 248 |
| మొత్తం పాఠశాలలు | 1,309 |

- పురుగులు పట్టిన బియ్యంతో వంట
- విద్యార్థులకు నీళ్ల చారు, ఉడికీ ఉడకని అన్నం
- అపరిశుభ్ర వాతావరణంలో భోజనం వడ్డింపు
- కిచెన్ షెడ్లు లేక ఆరు బయటే వంటావార్పు
- నాణ్యతలేని కూరగాయలతో కూరలు
- కొందుర్గు స్కూల్‌లోని ట్యాంకులో సీసా ముక్కలు
- 8 నెలలుగా నిర్వాహకులకు అందని బిల్లులు



కొందుర్గు : ఆరుబయట మట్టిలో కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థులు

## సర్కారు బడుల్లో నాసిరకంగా మధ్యాహ్న భోజనం

రంగారెడ్డి అర్బన్, నవంబరు 25 : (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల మండలం ఊరెళ్ల జెడ్పీహెచ్‌ఎస్‌కు రెండు నెలలుగా పురుగులు పట్టిన బియ్యం సరఫరా అవుతున్నాయని వంట నిర్వాహకులు చెబుతున్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో సున్నపు ముద్దల వలే అన్నం, దానితో పాటు ఒక కూర, లేదా పప్పు మాత్రమే అందిస్తున్నారు. కేశంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సరఫరా అవుతున్న బియ్యంలో రాళ్లు దర్శనమిస్తున్నాయి.



చేవెళ్ల : నాసిరకంగా అన్నం, కూర

### ఆరు బయటే భోజనాలు

చేవెళ్ల మండల పరిధిలోని ఊరెళ్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో 115 మంది విద్యార్థులు ఉండగా సోమవారం 108 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేశారు. అన్నం మెత్తగా ఉడకడంతో టమాట చారు నీళ్లగా ఉండటంతో కొంతమంది విద్యార్థులు భోజనం చేయలేదు. ఆమనగల్లు జెడ్పీహెచ్‌ఎస్‌లో 80మంది విద్యార్థులకు సోమవారం 68మంది హాజరయ్యారు. పై రెండు స్కూళ్లల్లో డైనింగ్‌హాల్ లేకపోవడంతో చెట్ల కింద, వరండాల్లో కూర్చుని భోజనం చేశారు.

### వాటర్ ట్యాంకులో సీసా ముక్కలు

కొందుర్గు బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలోని వాటర్ ట్యాంకులో సీసా ముక్కలు,

మిగతా 7వ పేజీలో...

### భోజనం సరిపడా వడ్డించడం లేదు..

ధారూరు మండలం స్టేషన్ ధారూరు ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటి నుంచి ఏడు తరగతుల్లో 85 మంది విద్యార్థులు ఉండగా, సోమవారం 72 మంది హాజరయ్యారు. వీరికి మధ్యాహ్న భోజనంలో అన్నం, సాంబారు, కోడిగుడ్డు వడ్డించారు. కాగా 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు 100 గ్రాముల బియ్యం, 10గ్రాముల కంది పప్పు వంతున వడ్డించాలి. దీంతో ఐదో తరగతి వరకు విద్యార్థులకు అన్నం, సాంబారు సరిపోవడం లేదు. పెట్టినంతనే తిని చేతులు కడుక్కుంటున్నారు. కోడిగుడ్డుకు ప్రభుత్వం రూ.5 చెల్లిస్తుండటంతో దానిని విద్యార్థులకు అందించలేకపోతున్నారు.

## పల్లెప్రగతితో
# పంచాయతీల అభివృద్ధి

- కందుకూరు, మహేశ్వరంను మున్సిపాలిటీగా ఏర్పాటును విరమించుకోవాలి
- హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

కందుకూరు,నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పల్లెప్రగతితో మున్సిపాలిటీలకు దీటుగా గ్రామపంచాయతీలను అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి తెలిపారు. సోమవారం కందుకూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కందుకూరు, మహేశ్వరాలను మున్సిపాలిటీలుగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతుందని, దీని ద్వారా నీటి, ఇంటి ట్యాక్స్‌లు పెరిగి ప్రజలు ఇబ్బంది పడతారని తెలిపారు. అలాగే జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో సమస్య వస్తుందన్నారు. కలెక్టర్ ప్రజల స్థితిగతులపై అధ్యయనం చేశాకే మున్సిపాలిటీల ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన 11నెలల్లో పంచాయతీలకు ఒక్క రూపాయి కూడ మంజూరు చేయలేదని, దీంతో మాజీ సర్పంచ్‌లు చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎన్నికల ముందు మాజీ సీఎం కేసీఆర్ మహేశ్వరం నియోజకవర్గానికి రూ.270కోట్లు మంజూరు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని రద్దు చేసిందని ఆరోపించారు. అలాగే ఎస్‌డీఎఫ్, హెచ్ఎండీఏ, టీఎస్ఐఐసీ నిధులను మంజూరు చేయలేదన్నారు. ఫార్మా కోసం గత ప్రభుత్వం కందుకూరు, యాచారం మండలాల్లో సేకరించిన 14వేల ఎకరాల భూమిని అధికారంలోకి వస్తే రైతులకు తిరిగి ఇచ్చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మాట మార్చిందని విమర్శించారు. ఫార్మాసిటీ వరకు 10రోడ్లు ఉన్నప్పటికీ ఫోర్త్‌సిటీ రోడ్డు కోసమని సేకరిస్తున్న భూములు ఎందుకని ఆమె ప్రశ్నించారు. ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తున్నారా..? ఫోర్త్‌సిటీ నిర్మిస్తున్నారా అనేదానిపై సీఎం రేవంత్ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయలేక కొత్తగా ఇంటింటి సర్వే పేరుతో ప్రజల దృష్టిని మళ్లించే కుట్రలు చేస్తుందని ఆరోపించారు. అనంతరం కొత్తూరు గేటు వద్ద వడ్లను ఆరబోసిన రైతు కర్నాటి లక్ష్మయ్యగౌడ్ వద్దకు వెళ్లి ఎమ్మెల్యే మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్ల ఆంక్షలతో ఇబ్బంది పడుతున్నామని రైతు వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎస్.సురేందర్‌రెడ్డి, కాకి దశరథ, కాసుల రామకృష్ణారెడ్డి, ఎలుక మేఘనాథ్‌రెడ్డి మన్నె జయేందర్‌ముదిరాజ్, టి.ఇందిరదేవేందర్, పొట్టి ఆనంద్, పి.పర్వతాలుయాదవ్, సామ ప్రకాశ్‌రెడ్డి, జి.సామయ్య, డాక్టర్ జంగయ్య పాల్గొన్నారు.



కొత్తూరు గ్రామ రైతు కర్నాటి లక్ష్మయ్యగౌడ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

# సెంట్రింగ్ దొంగల ముఠా అరెస్టు

- పోలీసుల అదుపులో ఎనిమిది మంది
- పరారీలో మరో 10 మంది

### రూ. 25 లక్షల విలువైన బాక్సులు స్వాధీనం



పట్టుబడిన నిందితులు, సెంట్రింగ్ డబ్బాలతో చేవెళ్ల పోలీసులు

చేవెళ్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సెంట్రింగ్ డబ్బాలను దొంగతనం చేసే ముఠాను సోమవారం చేవెళ్ల పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.25లక్షల విలువైన సెంట్రింగ్ బాక్స్‌లను స్వాధీనం చేసుకున్నారు. చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్, డిటెక్టివ్ సీఐ రమేశ్‌నాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని ముషీరాబాద్ ప్రాంతం గుల్షన్ నగర్‌కు చెందిన మోసిన్‌హైమద్ ఇనుప సామగ్రి వ్యాపారం చేస్తుంటారు. అయితే సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో నిర్మాణరంగంలో ఉన్న సెంట్రింగ్ బాక్సులను దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నాడు. బోలక్‌పూర్ ప్రాంతంలో పని చేస్తున్న ఉత్తర్‌ప్రదేశ్ చెందిన కూలీలతో కలిసి రాత్రి వేళ చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, మోకిల తదితర ప్రాంతాల్లో ఇంటి నిర్మాణంలో ఉన్న సెంట్రింగ్ బాక్సులు ఎత్తుకురావడం మొదలు పెట్టారు. వీటిని నార్సింగ్ ప్రాంతంలో తూకం చేసి అక్కడి నుంచి ముషీరాబాద్‌లో బోలక్‌పూర్‌లో సెకండ్‌హ్యాండ్ ధరకు అమ్మేవారు. ఆరు నెలలుగా మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లోనూ బాక్సులు ఎత్తుకొస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. అయితే ఇటీవల చేవెళ్ల మండలంలో రిజ్వాన్, హైమాద్, సాదక్‌లకు చెందిన సెంట్రింగ్ బాక్స్‌లు చోరీకి గురయ్యాయి. వీరు చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈనెల 10వ తేదిన ముడిమ్యాల్ గేట్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఓ ఫామ్‌హౌస్ వద్ద ఉంచిన సెంట్రింగ్ బాక్స్‌ల వద్ద పోలీసులు రాత్రి వేళ నిఘా ఉంచారు. ఆ రాత్రి మోసిన్ హైమాద్ ముఠా దొంగతనం చేసేందుకు వచ్చింది. ఇందులో ఆరుగురు పోలీసులకు పట్టుబడ్డారు. వారిని పోలీసులు తమదైన శైలిలో విచారించగా అసలు విషయం బయటపడింది. హైమాద్ ముఠా సభ్యులు మొత్తం 18 మంది కాగా, ఇందులో ఎనిమిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మిగతా వారు పరారీలో ఉన్నారు. పట్టుబడిన వారిపై ఇప్పటివరకు 11 కేసులు ఉన్నాయి. వారి నుంచి రూ.25లక్షలు విలువ చేసే 43 టన్నుల సెంట్రింగ్ బాక్స్‌లను, ఒక వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో ప్రధాన నిందితుడు మోసిన్ హైమాద్‌తోపాటు అతని ముఠా సభ్యులు అఖిల్‌బాజ్రా, రహమాన్‌ఖాన్, మహ్మద్ అర్బజ్, అలీ, కలాందీన్, అన్సర్‌అలీ, షకీల్ పట్టుపడ్డారు. వీరందరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే మరోసారి న్యాయస్థానం నుంచి అనుమతి తీసుకుని నిందితులను విచారణ చేయనున్నట్లు పోలీసులు వివరించారు. ఈ సమావేశంలో ఎస్సైలు శ్రీకాంత్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

## కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

- కార్మికుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జైపాల్‌రెడ్డి



మున్సిపల్ కార్మికులతో మాట్లాడుతున్న జైపాల్‌రెడ్డి

మహేశ్వరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం తుక్కుగూడలో మున్సిపల్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుక్కుగూడ మున్సిపల్ కార్మికులందరూ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉండాలన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రతీ రోజు మున్సిపాలిటీలో చెత్త, చెదారంతో రకరకాల వ్యర్థాలను తొలగించడంలో కార్మికుల పాత్ర ఎంతో ఉందన్నారు. కార్మిక హక్కులను కొందరు అధికారులు కాలరాయడమే కాకుండా అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. అలాంటి అధికారుల పనితీరులో మార్పు రావాలని, లేని పక్షంలో ఎంతటి పోరాటానికైనా సిద్ధమేనని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి బి. దత్తునాయక్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న డీఎస్‌పీ నాయకులు

## కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలి

ఇబ్రహీంపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యతోపాటు వైద్యం అందించాలని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్‌పీ) రాష్ట్ర కార్యదర్శులు అబ్దుల్ రెహమాన్, తులసిగారి రవీందర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. అర్హులైన పేదలకు ఎకరా చొప్పున సాగు భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ధర్నాలో రాఘవేందర్, అమరేందర్, రమేష్, నర్సిరెడ్డి, భవాని శేఖర్ ఉన్నారు.

## ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

- జిల్లా సంక్షేమాధికారి సంధ్యారాణి



దివ్యాంగుల ఆటల పోటీలను ప్రారంభిస్తున్న సంధ్యారాణి

రంగారెడ్డి అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలని జిల్లా సంక్షేమాధికారి సంధ్యారాణి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సరూర్‌నగర్‌లోని ఇండర్ స్టేడియంలో ఆటల పోటీలను నిర్వహించారు. రన్నింగ్, షాట్‌పుట్, చెస్, క్యారమ్స్, వీల్‌చైర్, ట్రైసైకిల్ రేస్ పోటీలను నిర్వహించారు. జిల్లాస్థాయి పోటీల్లో గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయి కి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో జిల్లా యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, సీడీపీవోలు, ఐసీడీఎస్ స్టాఫ్, ఐసీపీఎస్ స్టాఫ్, డిజెబుల్డ్, డీహెచ్ సఖి, స్వచ్ఛంద సంస్థలు, డీడీఆర్సీ ప్రతినిధి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇస్లామిక్ కాంగ్రికేషన్ ఏర్పాట్లపై సమావేశం

శంకర్‌పల్లి : శంకర్‌పల్లిలో జనవరిలో జరిగే ఇస్లామిక్ కాంగ్రికేషన్ ఏర్పాట్లపై అధికారులు సమీక్ష నిర్వహించారు. చేవెళ్ల ఆర్‌డీఓ చంద్రకళ, నార్సింగి ఏసీపీ రమణగౌడ్, ఆధ్వర్యంలో నిర్వాహకులతో సోమవారం సమావేశమయ్యారు. జంబోరి గ్రౌండ్‌లో జరుగనున్న సమావేశానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులు కోరారు. తహసీల్దార్ సురేందర్, కమిషనర్ శ్రీనివాస్, ఎంపీడీవో వెంకయ్యగౌడ్, సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

కొడంగల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సూచించారు. సోమవారం కొడంగల్ పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల, ఉర్దూ మీడియం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడే మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయ్ కుమార్, మున్సిపల్ కమిషన్ బలరాంనాయక్ తదితరులు ఉన్నారు.

## జైలు జీవితం తర్వాత పరివర్తన చెందాలి


ఖైదీలకు వడ్డించే ఆహారాన్ని పరిశీలిస్తున్న జడ్జి డీబీ శీతల్

పరిగి,నవంబరు 25(ఆంధ్రజ్యోతి): క్షణికావేశంతో చేసిన తప్పులతో జైలులో ఉంటున్న వారు పునరావృతం కాకుండా చూసుకోవాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి డీబీ శీతల్ అన్నారు. సోమవారం పరిగిలోని సబ్‌జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ముద్దాయిలతో మాట్లాడి యోగక్షేమాల గురించి తెలుసుకున్నారు. జైలులో రోజువారి దినచర్య, వసతుల గురించి జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. జైలు జీవితం గడిపినవారు పరివర్తన చెందాలని సూచించారు. జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఆర్థిక స్తోమత లేని పేద ముద్దాయిలకు జిల్లా సంస్థ ద్వారా ఉచిత లాయర్‌ను పెట్టుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో లీగల్ డిఫెన్స్ లాయర్లు రాము, వెంకటేశ్, శ్రీనివాస్, గౌస్ భాష, జైలు సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## బీసీలు రాజ్యాధికారం సాధించాలి



బీసీల సమరభేరికి బయలుదేరిన నాయకులు

తాండూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బీసీలుగా రాజ్యాధికారం సాధించడం ఖాయమని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ నగరం రవీంద్ర భారతిలో నిర్వహించిన బీసీల సమరభేరి సభకు తాండూరు నుంచి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాధికార సాధనకు బీసీలంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు మధు లతశ్రీనివాస్ చారి, అనిత, మంజుల, నర్సమ్మ, నరేందర్, బసంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడాకారులు ఉన్నత స్థాయికి ఎదగాలి


టోర్నమెంట్‌ను ప్రారంబిస్తున్న భాస్కర్‌రెడ్డి

మహేశ్వరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులు ప్రభుత్వాలు,ప్రజాప్రతినిధిలు, క్రీడాభిమానులు, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని టీ పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని కొళ్లపడకల్‌లో ఆయన వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీర దారుఢ్యానికి ఎంతో దోహదపడతాయన్నారు. అంతే కాకుండా క్రీడల్లో రాణిస్తున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కూడా అధికంగానే లభిస్తాయన్నారు. మహేశ్వరంలో మినీ స్టేడియం ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, యాదయ్య, కృష్ణ, సత్యం, రాజశేఖర్, ప్రశాంత్, మల్లేష్, శ్రీకాంత్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## ప్రమాణ స్వీకారానికి సన్నాహాలు

- మేడ్చల్ ఏఎంసీ, గ్రంథాలయ కమిటీల ప్రమాణానికి సిద్ధం


సమావేశంలో మాట్లాడుతున్న వజ్రేశ్ యాదవ్

మేడ్చల్ టౌన్, నవంబరు ( ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మార్కెట్ కమిటీ, జిల్లా గ్రంథాలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం విజయవంతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి వజ్రేశ్ యాదవ్ అన్నారు. సోమవారం ఆయన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమ ఏర్పాట్లలో భాగంగా మేడ్చల్ మార్కెట్ కమిటీని సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మంగళవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ నిమ్మల గార్డెన్‌లో ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతకు ముందు కొత్తగా నిర్మించిన మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, శ్రీధర్ బాబులు ప్రారంభిస్తారని తెలిపారు. మంత్రుల స్వాగతం కోసం పార్టీ తరఫున ప్రత్యే చర్యలు తీసుకోవాలని స్థానిక నేతలను కోరారు. సమావేశానికి జిల్లాలోని కార్పొరేషన్ల మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో పాటు ప్రజా ప్రతినిధులు నాయకులు హాజరు కానున్నారని తెలిపారు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేయాలి


ఛైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న ఈటల

మహేశ్వరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ ప్రజలకు రాజకీయాలతో సంబంధం లేకుండా అభివృద్ధి చేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. ఎంపీ ఈటల రాజేందర్ సోమవారం మధ్యాహ్నం ఢిల్లీ వెళ్తున్న సందర్భంగా తుక్కుగూడ మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని ఛైర్‌పర్సన్ హేమలత రాజును సన్మానించారు. హేమలత మాట్లాడుతూ తుక్కుగూడ మున్సిపాలిటీ అభివృద్ధి వెనకపడిందని రాజకీయాలకు అతీతంగా అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని దిశానిర్దేశం చేశారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజు, విలాస్ నాయకులు సధాకర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# అధ్వాన భోజనం!

(5వ పేజీ తరువాయి)

రాళ్లు దర్శనమిచ్చాయి. ప్రహరీ లేకపోవడంతో పాఠశాలలోకి కొందరు వాటర్ ట్యాంక్ వద్ద కూర్చుని మద్యం సేవిస్తున్నారు. తాగిన తర్వాత బాటిళ్లను పగులగొట్టి వాటర్ ట్యాంక్‌లో పడవేస్తున్నారు. ఆ నీటినే విద్యార్థులు తాగుతున్నారు. అలాగే ఆరుబయట రెండు రేకుల మధ్య వంటకాలు వండుతున్నారు.


తుమ్మలూరు ప్రాథమిక పాఠశాలలో కట్టెల పొయ్యిమీదే వంట చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

### భోజనంలో కరువైన పోషకాలు

ధారూరు, మర్పల్లి మండలంలోని చాలావరకు పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పోషక ఆహారం అందడం లేదు. దీంతో వారు ఎదుగుదల లోపాలు ఎదుర్కొంటున్నారు. పాఠశాలల్లో ఒకటి నుంచి 5వ తరగతి వరకు ప్రతి విద్యార్థికి కేటాయించిన బియ్యం కోటా సరిపోవటం లేదు. పెరిగిన ధరలతో కోడిగుడ్లు, కూరగాయల భారాన్ని నిర్వాహకులు తట్టుకోలేక పోతున్నారు. బిల్లుల కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని వాపోతున్నారు.

### ముద్దన్నమే దిక్కు

బషీరాబాద్ మండలంలో రీసైక్లింగ్ చేసిన బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. దీంతో అన్నం సరిగ్గా ఉడకక ముద్దగా ఉంటుంది. దానిని విద్యార్థులు తినలేక పారవేస్తున్నారు. మండలం మొత్తం ఇదే పరిస్థితి ఉందని ప్రధానోపాధ్యాయులు ఎంఈవోకు ఫిర్యాదు కూడా చేశారు. దామర్‌చెడ్ పాఠశాలను పరిశీలించగా 300 మంది విద్యార్థులు ఉండగా

**బోరు వాటరే దిక్కు..**

పూడూరు ప్రాథమిక పాఠశాలలో 142 మంది విద్యార్థులకు 112 మంది విద్యార్థులు భోజనానికి హాజరయ్యారు. చన్‌గోముల్ ఉన్నత పాఠశాలలో 190 మంది విద్యార్థులకు 125 మంది మాత్రమే హాజరయ్యారు. విద్యార్థులకు ఫిల్టర్ వాటర్ కాకుండా బోరు వాటర్‌నే సరఫరా చేసున్నారు. ట్యాంకులు, ట్యాప్‌ల వద్ద అపరిశుభ్రంగా ఉంది.

అక్కడ వంట గది లేదు. చెట్ల కిందనే వంట చేస్తున్నారు.

### నీళ్ల చారుతోనే సరి..

పూడూరు, దోమ మండలంలో చాలా వరకు పాఠశాలల్లో నీళ్ల చారుతో ఉడికి ఉడకని భోజనం వడ్డిస్తున్నారు. ఏ రోజూ మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. మర్పల్లి మండలంలోని కొత్లాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించగా అక్కడ మధ్యాహ్న భోజనంలో కూరగాయలు, కిచిడి, అన్నం, పప్పు పెట్టాల్సి ఉండగా, కేవలం నీళ్లచారు, అన్నం, గుడ్డు అందించారు. దౌల్తాబాద్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 460 మంది విద్యార్థులకు 380 మంది భోజనం చేశారు. ఇక్కడా నీళ్ల చారు, అన్నం, అరటి పండు విద్యార్థులకు వడ్డించారు.

### అపరిశుభ్ర పరిసరాల్లో...

బషీరాబాద్ మండలంలోని పాఠశాలల్లో అపరిశుభ్ర వాతావరణం ఉంది. ఇక్కడ 15 ఏళ్ల క్రితం చేపట్టిన వంట గది నిర్మాణం ఇప్పటికీ పూర్తికాలేదు. విద్యార్థులకు మెనూ ప్రకారమే వండిపెడుతున్నారు. బియ్యం సరఫరా బాగా లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. ఈ విషయమై సోమవారం మండలంలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎమ్మార్వోకు రీసైక్లింగ్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నారని ఫిర్యాదు చేశారు.

### వంట గది లేక ఇక్కట్లు..

కేశంపేట మండల పరిధిలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఇరుకైన వంట గది లో భోజనం వండుతున్నారు. నంది గామ, ఫరూఖ్‌నగర్ మండలాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. చౌదరిగూడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరు బయటే వంట చేస్తున్నారు. శంకర్‌పల్లి మండలం ఎర్వగూడ పాఠశాలలో సిలిండర్ లేక పోవడంతో కట్టెల పొయ్యిపైనే భోజనం వండారు. మహేశ్వరం మండలం తుమ్మలూరు బడిలో గ్యాస్ సిలిండర్‌కు ఖర్చు ఎక్కువవుతుందని కట్టెల పొయ్యిమీదే భోజనం వండారు. మహేశ్వరం మండలం తుమ్మలూరు ప్రాథమిక పాఠశాలలో 122 మంది విద్యార్థులున్నారు. కిచెన్ షెడ్డు లేక తరగతి గదిలోనే వంట చేస్తున్నారు. మంచాల మండల మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్‌లో 135 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రాథమిక పాఠశాలలో 99 మంది విద్యార్థులు ఉన్నారు. జెడ్పీహైస్కూల్‌లో ప్రత్యేక కిచెన్ ఉండగా ప్రాథమిక పాఠశాలలో చిన్నపాటి గదిలో పొగనిండిన పరిస్థితుల్లో వంటావార్పు చేస్తున్నారు. మంచాల జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలో కిచెన్‌లో సరిపడా స్థలం లేక కట్టెలు సైతం అందులోనే నిల్వ ఉంచుతున్నారు. వర్షం వస్తే పైకప్పు కురుస్తుంది. పూడూరు ప్రాథమిక పాఠశాలలో వంటగది లేక వరండాలో వంటలు చేస్తున్నారు. దోమ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మొత్తం 50 మంది విద్యార్థులకు గాను 41 మంది విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నారు. ఇక్కడ వంట గది శిథిలావస్థకు చేరుకుంది. తాండూరు మండలం మల్కాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చెట్ల కింద వంట చేస్తున్నారు. దౌల్తాబాద్‌లో పురాతన షెడ్డులో భోజనం తయారు చేస్తున్నారు. కీసర జెడ్పీహెచ్ఎస్‌లో, శామీర్‌పేట, ఘట్‌కేసర్ ఉన్నత పాఠశాలలో కూడా ఆరుబయట వంటావార్పు చేస్తున్నారు. పెద్దేముల్ మండలంలో 59 పాఠశాలలు ఉండగా 21 పాఠశాలలో కిచెన్ షెడ్లు లేవు. ఈ మండలంలో తక్కువ విద్యార్థులు ఉన్నచోట, గిరిజన తండాలలో, ఇళ్లలో భోజనాన్ని వండి పాఠశాలకు తీసుకువస్తున్నారు. అడ్కిచర్ల పాఠశాలలో పాడుబడిన గదులలో మధ్యాహ్న భోజనాన్ని వండుతున్నారు. 4 కిచెన్ షెడ్లు మరమ్మత్తులు చేయాల్సి ఉంది.

### 8 నెలలుగా అందని బిల్లులు

చేవెళ్ల మండలం ఊరెళ్ల జెడ్పీహెచ్ఎస్‌లో 8 నెలలుగా మధ్యాహ్న భోజన బిల్లులు అందటం లేవు. శంకర్‌పల్లి మండలం ఎర్వగూడ ప్రాథమికోన్నత, మహేశ్వరం మండలం తుమ్మలూరు ప్రాథమిక పాఠశాలల్లో రెండు మూడు నెలల నుంచి బిల్లులు రావడం లేదు. మంచాల జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలో నాలుగు నెలలుగా, పూడూరు, దోమ మండలంలో నెలల తరబడి బిల్లులు రావడం లేదు. చన్‌గోముల్, పూడూరు పాఠశాలల్లో గత ఫిబ్రవరి నుంచి బిల్లులు చెల్లించక ఏజెన్సీ నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. ధారూరు, మర్పల్లి మండలాల్లో గత ఆగస్టు నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కీసర, షామీర్‌పేటలో ఫిబ్రవరి నుంచి బిల్లులు పెండింగ్ ఉన్నాయి. బిల్లులు రాక అప్పులు చేయాల్సి వస్తున్నదని వంట నిర్వాహకులు వాపోతున్నారు.


వంట గది పైకప్పు ఇలా..


కొందుర్గు పాఠశాలలోని తాగునీటి ట్యాంకులో రాళ్లు, పగిలిన సీసా పెంకులు

### అమలుకాని మెనూ..

శంకర్‌పల్లి మండలంలోని ఏర్వగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం వడ్డించలేదు. సోమవారం టమాట రసం, కోడిగుడ్డును భోజనంలో వడ్డించాల్సి ఉండగా వంకాయ, టమాట కూరను పెట్టారు. కోడిగుడ్డు ఇవ్వలేదు. బియ్యంతోనే అన్నం వండారు. ఇక్కడ 20 మంది విద్యార్థులకు గాను 10మంది హాజరయ్యారు. మాడ్గుల మండలం అన్న బోయినపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 27 మంది విద్యార్థులకు గాను 15 మంది మధ్యాహ్న భోజనం చేశారు. పిల్లలకు అన్నం, పప్పు పెట్టారు. గుడ్డు ఇవ్వలేదు. షాద్‌నగర్ పరిధిలోని పాఠశాలలో మెను ప్రకారం భోజనం అందటం లేదు. మర్పల్లి మండలంలో మధ్యాహ్న భోజనం నిర్వాహకులు మెనూ ప్రకారం భోజనం అందిస్తే తమకు ఏమీ మిగలడం లేదని, బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

### నాలుగు నెలలుగా బిల్లులు రావడం లేదు

నాలుగు నెలలుగా బిల్లులు రావడం లేదు. దీంతో విద్యార్థులకు భోజనం వండేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. అప్పు చేసి మధ్యాహ్న భోజనం వండాల్సిన దుస్థితి నెలకొంది.

- కిష్టమ్మ, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలు

## పోక్సో కేసులో నిందితులకు జైలు, జరిమానా

### బాధితురాలికి నష్టపరిహారం

రంగారెడ్డి కోర్టులు/యాచారం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో ఓ బాలికను వేధించి అసభ్యంగా ప్రవర్తించి, లైంగికదాడికి పాల్పడిన నిందితుడు మహ్మద్‌కు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధించారు. దీంతో పాటు బాధితురాలికి రూ.లక్ష పరిహారం చెల్లించాలని పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎంకే పద్మావతి తీర్పు చెప్పారు. పీపీ సునీత తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిందితుడు మహ్మద్ ఓ బాలికను ప్రేమ పేరుతో లైంగికదాడికి పాల్పడ్డాడు. కేసు నమోదు చేసిన బాలాపూర్ పోలీసులు సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. సాక్ష్యులను విచారించిన నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా, బాధితురాలికి పరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు.

### మరో కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

మరో బాలికపై దాడికి యత్నించిన నిందితుడికి జైలు, జరిమానాతో పాటు పరిహారం చెల్లించాలని 9వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి హరీశ్ తీర్పు చెప్పారు. పీపీ సరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో వరికప్పల మహేశ్ అనే యువకుడు ాలికను మభ్యపెట్టి లైంగిక దాడికి పాల్పడ్డాడు. కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి హరీశ్ నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.25 వేల జరిమానాతో పాటు బాధితురాలికి రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు.


వేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

## ప్రారంభమైన వేంకటేశ్వరుడి పవిత్రోత్సవాలు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో వేద పండితులు, ఆలయ పూజారులు ఉత్సవ విగ్రహాలకు విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్యంగ్రహణము, అంకురారోపణము, పత్రాదివాసము కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం స్వామికి పుష్పయాగం, పవిత్ర మాలధారణతో పవిత్రోత్సవాలు ముగుస్తాయి. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పలబట్ల బాల్‌రాజ్‌గుప్త, పరిగి వెంకటసాయిశ్వరెడ్డి, ఎల్. మోహన్‌రెడ్డి, టి. ప్రతాప్‌రెడ్డి, ఒగ్గు కిషోర్, ఆర్. కృష్ణయ్య, కానుగు రాంభూపాల్, సూరిశెట్టి నర్సింహగుప్తా తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కేసులను ఎత్తివేయాలి

పరిగి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ, బీఎంపీ జిల్లా అధ్యక్షుడు పి.గట్యానాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్‌ల ఆధ్వర్యంలో సోమవారం పరిగికి వచ్చిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ వెంకటయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామ సభల పేరిట అనేక మార్లు రైతులను ఇబ్బందులకు గురి చేసి డ్రోన్‌ల ద్వారా సర్వే చేశారని తెలిపారు. లగచర్లలో కలెక్టరే స్వయంగా దాడి జరుగలేదని ప్రకటించినా రాజకీయ లబ్ధి కోసం గిరిజనులపై అక్రమ కేసులు పెట్టించి జైలుకు పంపారని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గట్యా, గోవింత్, ఎరన్‌పల్లి శ్రీనివాస్, నాగేశ్వర్, సూర్యానాయక్, హరినాయక్, రాజన్న, రవీందర్, గణేశ్ ఉన్నారు.

## ఏఎస్ఐ పోర్టల్‌పై అవగాహన అవసరం

### డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అజిత్ కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న అజిత్ కుమార్

హైదరాబాద్ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంస్థల నిర్వాహకులు ఐటీ రిటర్న్, స్థిర ఆస్తులు, వర్కింగ్ క్యాపిటల్, రుణాలు, ఖర్చులు, ఇన్‌పుట్, ఉత్పత్తులకు సంబంధించిన చట్టాలు, పరిమితులపై అవగాహన అవసరమని ఎన్ఎస్ఓ ప్రాంతీయ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎస్.అజిత్ కుమార్ అన్నారు. కేంద్ర గణాంకాల మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సహకారంతో రెడ్‌హిల్స్‌లోని కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో ఏఎస్ఐ పోర్టల్‌లో రిటర్న్ పద్ధతిపై శిక్షణ, గణాంకాల సేకరణ గురించి అవగాహన కల్పించారు. ఈ సర్వే ద్వారా సేకరించిన సమాచారం స్థూల దేశీయ ఉత్పత్తికి పారిశ్రామిక రంగం సహకారాన్ని అంచనా వేయడానికి సహాయపడుతుందన్నారు. సమావేశంలో ఎన్ఎస్ఓ, ప్రాంతీయ కార్యాలయం హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ శివపార్వతిరెడ్డి, ఎఫ్‌టీసీసీఐ సీనియర్ డైరెక్టర్ టి.సుజాత ఎస్ఎస్ఓలు కె. గురుస్వామి, రమేశ్ మెండుతోపాటు డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న మర్రి దీపిక

మేడ్చల్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో సమస్యలు పరిష్కరించడానికి సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని మేడ్చల్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం కార్యాలయంలో వాటర్‌వర్క్స్, పారిశుధ్యం, ఎలక్ట్రీషియన్ పనులు చేపట్టే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మంచినీటి సమస్య, పారిశుధ్యం, విద్యుత్ దీపాల సమస్యలను వెంటనే పరిష్కరించలన్నారు. ఇంటింటికి తిరిగి చెత్త సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సుందర్ నాయక్, శంకర్, విగ్నేష్, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు పెంచిన పెన్షన్ ఇవ్వాలి

- కొత్త పింఛన్లు వెంటనే మంజూరు చేయాలి
- ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్



మేడ్చల్ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దివ్యాంగులు

మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దివ్యాంగుల పెన్షన్ రూ. 6వేలకు పెంచుతామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి 11నెలలు దాటినా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. పెన్షన్ సొమ్మును పెంచకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయడం ఎంత వరకు సమంజసం కాదన్నారు. పెన్షన్‌లు పెంచేందుకు డబ్బులు లేవని చెప్తూనే మరోవైపు కమీషన్లు వచ్చే ప్రాజెక్టులకు లక్షల కోట్లు ఎలా కేటాయిస్తున్నారని ప్రశ్నించారు. అనంతరం ఈ మేరకు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని దివ్యాంగుల సమస్యలను పరిష్కరిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్, మల్లేష్, లక్ష్మీపతి, బాలయ్య శివ, రమేష్, చంద్రయ్య, బ్రహ్మయ్య, రాజారావు తదితరులు పాల్గొన్నారు.



రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట..

### రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట..

రంగారెడ్డి అర్బన్: దివ్యాంగులకు కొత్త పింఛన్ మంజూరు చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు వెంకట్, గౌరవ అధ్యక్షుడు వరమ్మ, ప్రధాన కార్యదర్శి అడివయ్య, కోషాధికారి వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట దివ్యాంగులు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ నాయకులు

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కందుకూరు, నవంబరు25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు, సిగరెట్, గుట్కా, జర్దా వంటి పొగాకు ఉత్పత్తులకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కందుకూరు ఎస్సై సైదులు అన్నారు. సోమవారం నేదునూరు ఆదర్శ పాఠశాలలో ప్రహరీ క్లబ్ అధ్యక్షురాలిగా ఆ పాఠశాల ప్రిన్సిపాల్ విష్ణుప్రియను నియమించారు. ఈ సందర్భంగా పాఠశాల, హాస్టల్ విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై మాట్లాడారు. గ్రామాల్లో, విద్యాసంస్థల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ క్రై, పోక్సో చట్టాల గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కాలంలో స్మార్ట్‌ఫోన్ యాప్‌లతో నేరాలు పెరిగాయని, అలాంటి వ్యక్తులపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రిన్సిపాల్ విష్ణుప్రియ, వైద్యాధికారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


నేదునూరు ఆదర్శ పాఠశాలలో ప్రహరీ క్లబ్ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై సైదులు

# మినీ స్టేడియం లేక క్రీడాకారుల ఇక్కట్లు


మహేశ్వరంలో ఆటల మైదానం లేక పట్టణ సమీప పొలంలో సాధన చేస్తున్న క్రీడాకారులు

మహేశ్వరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహేశ్వరంలో మినీ స్టేడియం నిర్మాణం పదేళ్లుగా నేతల హామీలకే పరిమితమైంది. స్టేడియం నిర్మాణానికి ఎవరూ శ్రద్ధ చూపడం లేదు. ఇక్కడ మినీ స్టేడియం నిర్మాణానికి పదేళ్ల కింద ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది. స్టేడియం కోసం సర్కారు స్థలాలున్నా నాయకుల సమన్వయ లోపంతో నిర్మాణం కాలేదు. మహేశ్వరంలోని సర్వే నంబర్ 306, సిరిగిరిపురంలోని ప్రభుత్వ భూమిలో స్టేడియం నిర్మించేందుకు అనుకూలంగా ఉందని రెవెన్యూ అధికారులిచ్చిన నివేదికలను బుట్ట దాఖలు చేశారు. నగరానికి చేరువలో ఉన్న నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ ప్రైవేట్ క్రీడా పోటీలేమైనా పెట్టాలంటే సాగు భూములు, రియల్ వెంచర్లు, పాఠశాలల ప్రాంగణాలే దిక్కవుతున్నాయి. గ్రామీణ యువత, క్రీడాకారులు, విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యం సాధించాలంటే సాధన తప్పనిసరి. అయితే ఇక్కడా మైదానం లేక ప్రతిభ ఉన్న ఎంతో మంది గ్రామ స్థాయిలకే పరిమితం అవుతున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు, సాగు భూముల్లో సాధన చేస్తున్నారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టిసారించి మహేశ్వరంలో మినీ స్టేడియం ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని మండలంలోని పలు గ్రామాల క్రీడాకారులు అభిప్రాయపడుతున్నారు.

### మైదానం లేక ఆడలేకపోతున్నాం



నాకు ఆటలంటే చాలా ఇష్టం. కబడ్డీ పోటీలు ఎక్కడున్నా నేను వెళ్లి ఆడుతాను. గ్రామాల్లో క్రీడామైదానాలు లేక క్రీడాకారులకు ప్రోత్సాహం లేకుండా పోయింది. మైదానం, స్పోర్ట్స్ కిట్లు ఉంటేనే ఏ ఆటలోనైనా ప్రావీణ్యం సాధిస్తాం. పొలాలు, వెంచర్లలో ఆటలు ఆడుతున్నాం. మహేశ్వరంలో మినీ స్టేడియం కట్టిస్తే వందలాది మంది క్రీడాకారులకు ప్రోత్సాహం కల్పించినట్టు అవుతుంది. క్రీడామైదానం లేక చాలా మంది బాలికలు కూడా క్రీడలపై ఆసక్తి చూపడం లేదు.
- సుబ్బు, వాలీబాల్ క్రీడాకారుడు, మహేశ్వరం

### క్రీడాకారుల తయారీకి మైదానం అవసరం



మినీ స్టేడియంలేక గ్రామాల్లోని అనేక మంది యువకులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్ క్రీడల్లో నైపుణ్యం వెలికితీయలేకపోతున్నాం. ఫిజికల్ డైరెక్టర్‌గా జాతీయ, అంతర్జాతీయస్థాయిలకు క్రీడాకారులను తయారు చేయాలనుకున్నా మైదానం లేక న్యాయం చేయలేకపోతున్నాం. ప్రభుత్వం మహేశ్వరంలో మినీ నిర్మించాలి. - తేజానాయక్, పీడీ మహేశ్వరం

# క్రైం కార్నర్

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


మృతిచెందిన జావెద్

షాద్‌నగర్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్దలో సోమవారం పరిగి రోడ్డుపై జరిగిన ప్రమాదంలో యువకుడు మృతిచెందాడని ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. జావెద్(18) బైక్‌పై షాద్‌నగర్ వైపు మళ్లుతుండగా కొందుర్గు వైపు నుంచి వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. తీవ్రగాయాలైన జావెద్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు చేరుకొని మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. జావెద్ తండ్రి లతీఫ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి


ఇమ్రాన్ మృతదేహం

శంషాబాద్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాముని చెరువులో చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి చెరువులో పడి మృతిచెందిన సంఘటన సోమవారం ఆర్జీఐఏ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని ముషీరాబాద్‌కు చెందిన సయ్యద్ ఇమ్రాన్(29) ఆదివారం చేపల వేట కోసం కాముని చెరువుకొచ్చాడు. ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. స్థానికులు గమనించి అతడిని ఒడ్డుకు చేర్చారు. అప్పటికే అతడు గాలి అందక నీరు మింగి స్పృహ కోల్పోయాడు. 108అంబులెన్స్‌లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం చనిపోయాడు. మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. ఇమ్రాన్‌కు భార్య, పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## మంగళసూత్రం చోరీ చేసిన నిందితుడికి రిమాండ్

కందుకూరు,నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఓ మహిళా గొర్రెల కాపరి మెడలోని మంగళసూత్రాన్ని తెంపుకున్న నిందితుడిని సోమవారం రిమాండ్ చేసినట్లు కందుకూరు సీఐ సీతారాం తెలిపారు. ఆయన తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం గుమ్మడవెల్లి-బేగంపేటల మధ్య ఉన్న మామిడి తోటలో గుమ్మడవెల్లికి చెందిన జంగమ్మ, తన భర్త వీరస్వామి, కుమారుడు జగదీశ్వర్‌లతో మేకలను మేపుతోంది. ఖమ్మం జిల్లా మధిర మండలం మాదెపల్లికి చెందిన గ్యారాపాటి స్వామి(37) స్వామి.. జంగమ్మ మెడలోని చైన్‌ను(రోల్డ్‌గోల్డ్)ను తెంపుకొని పారిపోతుండగా గ్రామస్థులు పట్టుకొని పోలీసులకప్పగించారు. స్వామిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపాడు.

# ఇబ్రహీంపట్నంలో 96శాతం సర్వే పూర్తి

ఇబ్రహీంపట్నం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో కుటుంబ సర్వే 96శాతం పూర్తయినట్లు కమిషనర్ రవీంద్రసాగర్ సోమవారం తెలిపారు. మొత్తం 7,868 కుటుంబాలకు సర్వే చేస్తున్నామన్నారు. 102 మంది ఎన్యూమరేటర్లు సర్వేలో వివరాలు సేకరిస్తున్నారు. ఎవరిళ్లకైనా తాళం ఉన్నా, తప్పి పోయిన ఇళ్లు ఉన్నా టోల్ ఫ్రీ నం:7675829268/9866683040లకు ఫోన్ చేస్తే వచ్చి వివరాలు సేకరిస్తారన్నారు. డాటా ఎంట్రీ కొనసాగుతున్నదని ఆయన చెప్పారు. ఇబ్రహీంపట్నం మండలంలో 98.5శాతం సర్వే పూర్తయినట్లు ఎంపీడీవో వెంకటమ్మ తెలిపారు. మొత్తం ఇళ్లు 11,151 కాగా 10,984 ఇళ్ల సర్వే పూర్తయిందని చెప్పారు. ఎవరైనా సర్వేకు దూరంగా ఉంటే ఆయా పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని తెలిపారు.

### నేటితో ముగియనున్న సర్వే

కేశంపేట: మంగళవారంతో ఇంటింటి కుటుంబ సర్వే ముగుస్తుందని, వివరాలివ్వని వారు ఎన్యూమరేటర్‌తో వివరాలు నమోదు చేయించుకోవాలని కేశంపేట ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి కోరారు. మండలంలో 13,572 కుటుంబాలను గుర్తించామన్నారు. ఇప్పటి వరకు 97శాతం కుటుంబాల సర్వే పూర్తయిందని ఆయన తెలిపారు.

### సర్వేను వినియోగించుకోవాలి

షాద్‌నగర్ అర్బన్: షాద్‌నగర్ మున్సిపాలిటీలోని ప్రజలంతా ప్రభుత్వం చేస్తున్న సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ కుల గణన సర్వేను వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకన్న కోరారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని 28వార్డుల్లో రెండు రోజుల్లో కుల గణన ముగుస్తుందన్నారు. ఆ లోపు సర్వేకోసం వచ్చే ఎన్యూమరేటర్‌ను కలిసి వివరాలు తెలుపాలని కోరారు. ఎన్యూమరేటర్‌ను కలవలేని వారు రాంచందర్‌రావు(9959909909)కు ఫోన్ చేసి వివరాలు చెప్పాలని ఆయన కోరారు.

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

మంచాల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే ఎం.కిషన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం ఆరుట్లలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ప్రజల ఓట్లు వేయించుకొందన్నారు. రైతు భరోసా ఇస్తామని రైతుబంధును మింగారని, వరికి రూ.500 బోనస్ ఇవ్వడం లేదన్నారు. అన్న మాట ప్రకారం రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయాలని, వెంటనే రైతుభరోసా డబ్బులివ్వాలని డిమాండ్ చేశారు.ఈ నెల 29న బీఆర్ఎస్ తలపెట్టిన దీక్షాదివస్‌పై పార్టీ జిల్లా కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ముఖ్యనేతలు హాజరు కావాలని ఆయన కోరారు.

### కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

ఆపదలో ఉన్న కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని కిషన్‌రెడ్డి అన్నారు. అనారోగ్యానికి గురైన బీఆర్ఎస్ నాయకుడు కందాల శ్రీశైలాన్ని ఆయన పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు రమేష్, సత్తు వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీపీలు నర్మద, ఇందిర, సుకన్య, డి.రవి, ఎం.కృష్ణ, పున్నం రాము, జానీపాషా, జంగయ్య, రఘుపతి, చంద్రయ్య, రమేష్‌గౌడ్, జంగమ్మ, బద్రీనాథ్, యాదగిరి, ఎల్.జంగయ్య, ఎ.కృష్ణ, నిట్టు జగదీష్, ఎన్.శేఖర్, కె.మల్లేష్, చంద్రకాంత్, బి.మల్లప్ప, కె.రాంరెడ్డి, రఘు, జానయ్య, శ్రీనివాస్, ప్రశాంత్, హన్మంతు, శ్రీకాంత్, రాజేష్, అమరేందర్‌రెడ్డి, వీరేష్, ప్రసాద్, ప్యాక్స్ చైర్మన్లు రాజేందర్‌రెడ్డి, వెంకటరెడ్డి, మహేందర్‌రెడ్డి, శంకర్, యాదయ్య, ఖాజా, సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు.

# డెయిరీ దుకాణాల కేటాయింపు

కడ్తాల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):కడ్తాలలోని డెయిరీ చిల్లింగ్ సెంటర్ ఆవరణలో నిర్మించిన దుకాణాలను సోమవారం టెండర్‌దారులకు కేటాయించారు. 2022లో పది షెటర్లను నిర్మించారు. తెలంగాణ డెయిరీ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ ఇటీవల దుకాణాలకు టెండర్లు ఆహ్వానించింది. 70మంది టెండర్లు వేశారు. కందుకూరు ఆర్డీవో ఆఫీసులో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సమక్షంలో టెండర్లను ఓపెన్ చేశారు. టెండర్‌లో రెంట్ ఎక్కువ కోట్ చేసిన వారికి షెటర్లు కేటాయించారు. ఈ షాపింగ్ కాంప్లెక్స్ ద్వారా కడ్తాల చిల్లింగ్ సెంటర్‌కు ఆదాయం సమకూరనుంది. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ శివాల్కర్‌యాదవ్, డెయిరీ సెంటర్ మేనేజర్ రాధిక, తహసీల్దార్లు, జిల్లా పశువైద్య అధికారులు పాల్గొన్నారు.

## చింతకుంటపల్లి భూ సర్వే చేయాలి : ఎంపీ

కేశంపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): చింతకుంటపల్లికి సంబంధించిన భూ సర్వే చేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే.అరుణ సోమవారం సీసీఎల్ఏకు లేఖ రాశారు. గ్రామానికి నక్ష(మ్యాప్) లేకపోవడంతో రైతుల ఇబ్బందులు పడుతున్నారని లేఖలో పేర్కొనారు. గ్రామంలో ప్రభుత్వం సర్వే చేయించి, నక్ష రూపొందించాలని లేఖలో కోరారు.

## ప్రజాపాలన సభను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు

చౌదరిగూడ,నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవ సభను విజయవంతం చేయాలని జిల్లేడ్ చౌదరిగూడ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొచ్చి వచ్చే నెల 9వ తేదీతో ఏడాది పూర్తవుతున్న సందర్భంగా జిల్లేడ్ చౌదరిగూడలో మంగళవారం నిర్వహించే ప్రజాపాలన విజయోత్సవ సభకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. ఈ సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్, సత్యనారాయణరెడ్డి, వెంకటనర్సింహారెడ్డి, ఎదిరబాల్‌రాజ్, అన్వర్, రవికుమార్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీ ఎన్నిక


ఎమ్మార్పీస్ మండల నూతన అధ్యక్షుడికి నియామకపత్రం అందజేత

చౌదరిగూడ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండల ఎమార్పీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎమార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెంటన్నోళ్ల నర్సింహ అధ్యక్షతన కొందుర్గు మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు నాయకులు సోమవారం తెలిపారు. ఎమార్పీఎస్ మండల అధ్యక్షుడిగా ఆనంద్, అధికార ప్రతినిధి దుర్గని శ్రీను, ఉపాధ్యక్షులు వెంకటేష్, బాలయ్య, సాయిలు, ప్రధానకార్యదర్శిగా రమేష్, కోశాధికారి అంజయ్య, ప్రేమ్‌కుమార్, కార్యదర్శులు బాలాంజనేయులు, చంద్రయ్య, శ్రీను, శేఖర్‌లతో పాటు మరికొంతమందిని సభ్యులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎమార్పీఎస్ నాయకులు వెంకటయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుతో అధికాదాయం


అవగహన కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, అధికారి

చౌదరిగూడ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి, ఆదాయం సాధించే ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయ అధికారుతు తెలిపారు. సోమవారం ఎదిర రైతు వేదికలో ఏఈవో సోని మాట్లాడుతూ పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలన్నారు. ఆయిల్‌పామ్‌లో అంతర పంటలు పత్తి, మొక్కజొన్న, కూరగాయలు పంటలు పండించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ రాకేష్, రైతులు శ్రీనివాస్‌రెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పలుగుట్టను సందర్శించిన హార్టీకల్చర్ విద్యార్థులు


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీవో విఠలేశ్వర్

చేవెళ్ల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగును తెలుసుకునేందుకు తెలంగాణ రాష్ట్ర కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాల విద్యార్థులు చేవెళ్ల మండలం పలుగుట్ట గ్రామాన్ని సోమవారం సందర్శించారు. గ్రామంలో సాగవుతున్న ఉద్యన పంటలను పరిశీలించారు. రైతులతో పంటల సాగుపై చర్చించారు. అనంతరం మండల ఎంపీవో విఠలేశ్వర్‌తో కలిసి మండలంలో ఉద్యాన పంటల సాగు తదితర అంశాలపై హార్టికల్చర్ విద్యార్థులు అడిగి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, రైతులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## డబుల్ రోడ్డుగా మార్చాలని వినతి

కడ్తాల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎక్వాయ్‌పల్లి నుంచి ముద్విన్ వెళ్లే బీటీ రోడ్డును ఆధునీకరించి దానిని డబుల్ రోడ్డుగా విస్తరించాలని స్థానిక నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరారు. సోమవారం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఈ మేరకు నాయకులు మాజీ ఉపసర్పంచ్ వినోద్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో కర్కల్ పహాడ్ నుంచి చరికొండ వరకు బీటీ రోడ్డు మరమ్మతుకు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. కర్కల్‌పహాడ్ నుంచి ఎక్వాయ్‌పల్లి వరకు మాత్రమే రోడ్డు వెడల్పు పూర్తి చేశారని చెప్పారు. ఎక్వాయ్‌పల్లి నుంచి ముద్విన్ వరకు రోడ్డు గుంతలమయంగా మారిందన్నారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యేకు చెప్పారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి ఈ రోడ్డును పూర్తి చేయించాలని కోరారు. అలాగే గ్రామాభివృద్ధికి నిధులు మంజూరే చేయాలని కోరారు. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా చూస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్య, సతీష్, వెంకటరెడ్డి, శంకరయ్య గోపాల్, వెంకటేష్, జంగయ్య, శ్రీను పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, పాల్గొన్న నాయకులు

ఆమనగల్లు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. అలాగే వడ్ల కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. కడ్తాల మండలం ముద్విన్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సోమవారం డీసీసీబీ డైరెక్టర్ జి. వెంకటేష్,ఆమనగల్లు ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీత నర్సింహ్మా, వైస్ చైర్మన్ జి.భాస్కర్ రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. జనవరి 10వ తేదీ వరకు కొనుగోలు కేంద్రాలుంటాయని తెలిపారు. ధాన్యం అమ్మిన మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తారన్నారు. క్వింటాల్‌కు రూ. 2,330, రెండోర కం రూ.2,300 ఇస్తారన్నారు. సన్నరకం వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని తెలిపారు. వెంకటేష్, యాట గీత మాట్లాడుతూ ధాన్యం రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతులను మోసగిస్తే ఎంతటి వారిపైనైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి గూడూరు భాస్కర్‌రెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్లు నరేష్, శ్రీశైలం, నాయకులు నరసింహ, జహంగీర్ అలీ, అశోక్, భీష్మాచారి, ప్రభులింగం, లక్ష్మయ్య, ఏవో శ్రీలత తదితరులు ఉన్నారు.

### షాద్‌నగర్ యార్డ్‌కు కొనుగోలు కేంద్రం

షాద్‌నగర్ రూరల్: రైతులు, ప్రజాప్రతినిధుల కోరిక మేరకు ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్టలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని షాద్‌నగర్ పత్తి మార్కెట్ యార్డుకు తరలించామని ఏవో నిషాంత్ తెలిపారు. రైతులు తమ వడ్లను షాద్‌నగర్ యార్డుకే తీసుకురావాలని తెలిపారు. నిబంధనల ప్రకారం ధాన్యం తెచ్చి మద్దతు ధరపొందాలని సూచించారు. ఆయన వెంట సీఈవో రఘునందన్ ఉన్నారు.


ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో నిషాంత్‌కుమార్, సీఈఓ రఘునందన్

## 'ప్రజాపాలన' కళాజాత

కడ్తాల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సంవత్సరం పూర్తయిన సందర్భంగా కడ్తాల్‌లో సోమవారం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన పేరిట విజయోత్సవ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి నవంబరు 19వ తేదీ నుంచి డిసెంబరు 7వ తేదీ వరకు ప్రజాపాలన విజయోత్సవాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో మండల కేంద్రంలో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కళాజాత అట పాటల రూపంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకం కింద ప్రతీ ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500కు వంటగ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ వసతి, పేదలకు రూ.10లక్షల వరకు ఆరోగ్య బీమా, వివిధ ఉద్యోగ నియామకాలు, మహిళా సంఘాలకు రుణాలు, మహిళలకు ఉపాధి శిక్షణ, రైతులకు రెండు లక్షల రుణమాఫీ వంటి పథకాలపై ప్రచారం చేశారు.త్వరలోనే రైతుభరోసాను ప్రభుత్వం అందజేయనుందని కళాకారులు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతోందని, ప్రజాపాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఆటపాటలతో వివరించారు. కార్యక్రమంలో కళాకారులు యాదయ్య, మోహన్, అపూర్వ, యాదమ్మ, కాంగ్రెస్ నాయకులు రాజేష్, భానుకిరణ్, శ్రీనివాస్,బ్రహ్మచారి,జంగయ్య, శ్రీకాంత్, వెంకటమ్మ, శ్రీలత పాల్గొన్నారు.


ప్రజలకు ప్రభుత్వ పనితీరును వివరిస్తున్న కళాజాత బృందం

## ఘనంగా అయ్యప్ప పడిపూజ


పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులు, భక్తులు

యాచారం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి):యాచారంలో వందలాది మంది అయ్యప్ప మాలధారులు పడిపూజ నిర్వహించారు. పట్టణం అయ్యప్ప శరణుఘోషతో దద్దరిల్లింది. సోమవారం గురుస్వామి కె.బాషా చేసిన పూజలో వందలాదిగా మాలధారులు పాల్గొన్నారు. మాల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్, కామారెడ్డి ఎమ్మెల్యే కె.వెంకటరమణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తి దైవభక్తిని కలిగి ఉండాలని, ప్రజలంతా శాంతియుతంగా మెలగాలన్నారు.

### శివాలయాల్లో కార్తీక పూజలు

కార్తీక చివరి సోమవారం సందర్భంగా నందివనపర్తి, గున్‌గల్, నల్లవెల్లి గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు పూజలు, అభిషేకాలు చేశారు. కొందరు తమ ఇళ్ల వద్ద అన్నదానాలు నిర్వహించారు.

### భజనలు, గీతాలాపనలు

ఆమనగల్లు: ఆమనగల్లులోని అభయాంజనేయస్వామి భజనమండలి ఆధ్వర్యంలో కార్తీక భజనలు, భక్తిగీతాలాపనలు కొనసాగుతున్నాయి. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం రాత్రి రిటైర్డ్ టీచర్ వల్లభదాసు, నారాయణగౌడ్‌ల నివాసంలో పూజలు నిర్వహించారు.హనుమాన్ ఆలయంలో పూజలు, అర్చనలు, గీతాలాపనలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు తల్వారి రామకృష్ణాచార్యుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో అభయాంజనేయస్వామి ఆలయ భజన మండలి అధ్యక్షుడు వల్లభదాసు, పార్థసారథి, ఆంజనేయులు, ఎంగలి రఘు, మనోహర్, కృష్ణయ్య, భాస్కరాచారి, శ్రీశైలం భారీ గ్రామస్తులు పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భజన మండలి సభ్యులు

# సంక్షిప్తంగా

### ఏఎంసీ చైర్‌పర్సన్‌కు సత్కారం



కడ్తాల్: మార్కెట్ యార్డ్‌లో రైతులకు మెరుగైన వసతులు కల్పిస్తామని ఏఎంసీ నూతన చైర్‌పర్సన్ గీతనర్సింహ అన్నారు. మక్తమందారంలో సోమవారం గీత దంపతులను కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. మేనేజర్ సేవ్యానాయక్ వారిని సత్కరించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది జయరాం, నయీం, రాఘవేందర్, కాంగ్రెస్ మండల నాయకులు బాల్‌రాజ్, చంద్రయ్య, శివకుమార్ ఉన్నారు.

### ఎమ్మెల్యేను కలిసిన ఏఎంసీ పాలకవర్గం

ఆమనగల్లు: ఆమనగల్లు మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఎమ్మెల్యే నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్‌పర్సన్ గీత, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్లు ఎమ్మెల్యేను నగరంలోని ఆయన నివాసంలో కలిశారు.ఏఎంసీలో తమకు అవకాశం కల్పించినందుకు వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెప్పి సత్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఆజం, రమేష్, వెంకటరెడ్డి, శ్రీశైలం, రవీందర్, జగదీష్ జంగయ్య, యాదయ్య, రంగయ్య, పాండు, సంపత్, శ్యాంసుందర్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి భూమిపూజ

కేశంపేట: కొండారెడ్డిపల్లిలో ఆలయలను నిర్మిస్తున్నారు. పసులాది ఉమాపతిరెడ్డి శివాలయానికి సహకారం అందిస్తుండగా, బాణాల శ్యామ్‌కుమార్ నవగ్రహాల ఏర్పాటుకు విరాళం ఇచ్చారు. సోమవారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో పల్లె బాలీశ్వర్, పసులాది జగన్మోహన్‌రెడ్డి, సూరం శ్రీనివాస్, గౌతపురం కృష్ణయ్యగౌడ్, పసుల లింగం, సూరం శేఖర్, మల్లేష్‌గౌడ్, కరుణాకర్, యాదయ్య, అంజయ్య, నరసింహ, పబ్బే రాము తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి నాయకుల అండ

కేశంపేట: మండల కేంద్రానికి చెందిన సిరిగిరి జంబులమ్మ సోమవారం మృతిచెందింది. ఆమె కుటుంబీకులకు మాజీ జడ్పీటీసీ విశాలశ్రవణ్‌రెడ్డి, జర్నలిస్ట్ రమణగౌడ్ రూ.5 వేల చొప్పున, కాంగ్రెస్ నాయకుడు పవన్‌కుమార్‌రెడ్డి రూ.3వేల సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో కార్యక్రమంలో మంచే కృష్ణయ్య, గంజాయి దశరథ్, మారం వెంకటయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

### సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

యాచారం: సైబర్‌నేరాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యాచారం సీఐ నర్సింహారావు, ఎస్సై మధు సూచించారు. సోమవారం రాత్రి యాచారంలో దుకాణాదారులతో మాట్లాడారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఆధార్ నంబర్, బ్యాంక్ ఖాతా నెంబర్, మొబైల్ నంబర్లను గుర్తుతెలియని వ్యక్తులకు చెప్పొద్దని తెలిపారు. వాహనాలకు నంబర్ ప్లేట్ పెట్టుకోవాలని, టూ వీలర్లు హెల్మెట్ పెట్టుకోవాలని, కారు డ్రైవర్లు సీట్‌బెల్ట్ ధరించాలని చెప్పారు.

### అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి

తలకొండపల్లి: నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇళ్లు కట్టించాలని మాజీ జెడ్పీటీసీ వెంకటేష్ అన్నారు. లింగరావుపల్లికి చెందిన పేదలకు ఇళ్ల నిర్మాణానికి మెటీరియల్ సమకూర్చగా ట్రస్ట్ సభ్యులు, నాయకులు వాటిని అందజేశారు. వెంకటరెడ్డి, ఇమ్రాన్, శ్రీనివాస్ గౌడ్, ఎలమందరెడ్డి, యాదయ్య, జంగయ్య ఉన్నారు.

### సేవలనుబట్టే సమాజంలో కీర్తి

ఆమనగల్లు: సామాజిక సేవల్లో ప్రతీఒక్కరు పాలుపంచుకోవాలని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్‌చౌహాన్ అన్నారు. ఆమనగల్లులోని శ్రీలక్ష్మి గార్డెన్‌లో చెన్నై శంకరన్ కంటి ఆస్పతి సౌజన్యంతో ఐక్యత ఫౌండేషన్ నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాములుతో కలిసి కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఏడు రోజులుగా 4,300మందికి కంటి పరీక్షలు చేసి 3,200 మందికి కళ్లద్దాలిచ్చామని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఐక్యత ఫౌండేషన్ అందిస్తున్న నేత్ర వైద్య సేవలను సీఐ అభినందించారు. వీరిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రమేష్, యాదయ్య, శేఖర్, శ్రీపతిశ్రీను, మల్లయ్య, కొండల్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, మహేష్, కల్యాణ్ పాల్గొన్నారు.

